SK1 one NEWS HD
www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com
ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 166 | పేజీలు : 04, వెల రూ. 2 రూ/ | శుక్రవారం 04-09-2026

## లోకేష్ వెంటనే రాజీనామా చేయాలి



- డీఎస్సీలో అక్రమాల బండారం బయటపడిందని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు.
- స్పోర్ట్స్ కోటా, పేపర్ లేకేజి ఆరోపణలపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.
- గురువారం విశాఖలో వరుదు కళ్యాణి మీడియా సమావేశం నిర్వహించారు.

డీఎస్సీలో అక్రమాల బండారం బయటపడిందని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. మిగతా 2లో

## సోషల్ మీడియాలో జెన్ జీ క్రియాశీలకం

**ఆ ప్రకటనల్లో మంత్రుల ఫొటోలు లేకపోవడం సరికాదు: సీఎం చంద్రబాబు**

- అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో మంత్రుల ఫొటోలు లేకపోవడం సరికాదు
- సోషల్ మీడియాలో జెన్ జీ క్రియాశీలకం..అందుకు తగ్గట్టుగా సిద్ధమవ్వాలి
- వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో కనిపించని మంత్రి నిమ్మల ఫొటో
- నిమ్మల ఫొటోను ముద్రించకపోవడాన్ని తప్పుబట్టిన చంద్రబాబు
- భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకూడదని ఆదేశం
- ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసుకోవడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.
- ప్రభుత్వానికి సంబంధించిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవడం తీవ్రమైన పొరపాటని, ఇది ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు.
- ముఖ్యంగా వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఫొటోను ముద్రించకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా కఠిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసుకోవడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మిగతా 2లో

## ఏపీలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు



- సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన పర్యాటక శాఖ మార్కెటింగ్ కమిటీ ప్రమోషన్ సమావేశం..పర్యాటక రంగానికి మరింత ఊతమిచ్చేలా సుదీర్ఘ చర్చ
- అమరావతి:రాష్ట్రంలో పర్యాటక రంగానికి మరింత ఊతమిచ్చేలా వినూత్న కార్యక్రమాలు, మెగా, జిల్లా స్థాయి ఈవెంట్లను నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు.

అమరావతి:రాష్ట్రంలో పర్యాటక రంగానికి మరింత ఊతమిచ్చేలా వినూత్న కార్యక్రమాలు, మెగా, జిల్లా స్థాయి ఈవెంట్లను నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, మిగతా 2లో

## 'వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది'

- ఇరాన్‌పై అమెరికా నిఘా పూర్తిస్థాయిలో ఉందన్న ట్రంప్
- అవసరమైతే మరోసారి దాడి చేస్తామని హెచ్చరిక
- హర్మూజ్‌పై తమకు బలమైన పట్టు ఉందని వెల్లడి



అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు పెరిగాయి. ఇరాన్‌పై తమ నిఘా ఎంత పకడ్బందీగా ఉందో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇరాన్‌లో ఏం జరుగుతుందో తమకు ఎప్పటికప్పుడు తెలుస్తోందన్నారు. మిగతా 2లో

## నీటి సంరక్షణ సాంకేతికతలపై దృష్టిసారించాలి

- పట్టణ ప్రాంతాల్లో నీటి కొరత తీవ్రతరంకాకుండా జల సంరక్షణ సాంకేతికతలను మరింతగా అమల్లోకి తేవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.
- జలంపై కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన జాతీయస్థాయి రెండు రోజుల కార్యక్రమం ముగింపు వేడుకలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు.



న్యూఢిల్లీ: పట్టణ ప్రాంతాల్లో నీటి కొరత తీవ్రతరంకాకుండా జల సంరక్షణ సాంకేతికతలను మరింతగా అమల్లోకి తేవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. మిగతా 2లో

## కాంగ్రెస్‌ది 420 ప్రభుత్వం




- తెలంగాణలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నా ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రతి విషయంలోనూ మోసం చేసిన '420 ప్రభుత్వం'గా మిగిలిపోయిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు.
- ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల గొంతు కోసిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు.

తెలంగాణలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నా ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రతి విషయంలోనూ మిగతా 2లో

## తెలంగాణలో హెలీ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

**ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి**

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం
- సదస్సులో భాగంగా రక్షణ ఎక్స్‌పో--2026ను ప్రారంభించాలని వినతి
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు కోసం మరో 750 ఎకరాల భూసేకరణకు సిద్ధమని వెల్లడి
- డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు దేవరకద్ర వద్ద 416 ఎకరాల భూకేటాయింపునకు హామీ
- పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతోనూ సీఎం భేటీ
- సాగు ప్రాజెక్టుల కార్యసాధకుడు వైఎస్సార్
- ఉమ్మడి ఏపీలో వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలోనే పోలవరం, ప్రాణహిత--చేవెళ్ల పనులు
- ఆయన కలగన్న ప్రాణహిత, కల్వకుర్తి,ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
- డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి అవార్డు ప్రదాన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు అవార్డు అందించిన ఖర్గే



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026కు హాజరు కావాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో భాగంగా రక్షణ ఎక్స్‌పో--2026ను ప్రారంభించాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రేవంత్‌రెడ్డి బుధవారం ఉదయం రాజ్‌నాథ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ కార్మిక, గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కర వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాలను రాజ్‌నాథ్‌కు సీఎం వివరించారు. మిగతా 2లో

## అనకాపల్లికి గోదావరి జలాల పేరుతో చంద్రబాబు డ్రామా



- పోలవరం ఎడమ కాలువ ద్వారా నీరిచ్చామంటూ ఆర్భాటం
- పోలవరం ఎత్తు 41 మీటర్లకు కుదింపు
- అలా ఉత్తరాంధ్రకు ద్రోహం చేసిన చంద్రబాబు
- భూములు కార్పొరేట్లకు. సాగునీరు ప్రైవేట్ సంస్థలకా?
- మరి అనకాపల్లి జిల్లా రైతుల పరిస్థితి ఏమిటి?
- సూటిగా ప్రశ్నించిన మాజీ ఎంపీ డాక్టర్ బీశెట్టి సత్యవతి
- పోలవరం డ్యామ్ పూర్తి కాకుండా నీటి విడుదలేమిటి?

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనకాపల్లి జిల్లా పర్యటనలో భాగంగా పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల చేశామని చెప్పడం పచ్చి బూటకమని, ఇది ప్రజలను నిలువునా మోసం చేయడమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు మండిపడ్డారు. అనకాపల్లికి గోదావరి జలాలు అంటూ, సీఎం చంద్రబాబు నానా హంగామాతో పెద్ద డ్రామా చేశారని అనకాపల్లిలోని వైయస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడిన మిగతా 2లో

## ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోంది

**అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు**

- రాష్ట్ర మంత్రులతో సమావేశమైన నారా లోకేశ్
- స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తి లేదని వెల్లడి
- రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి సమావేశమయ్యారు.



రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, మిగతా 2లో

## చెన్నైలో 'ఒలింపిక్ సిటీ'.. ఫార్ములా-1 ట్రాక్.!



రూ. 1,200 కోట్లతో వందేళ్లు నిలిచేలా కొత్త సెక్రటేరియట్

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సంచలన నిర్ణయాలతో దూసుకు పోతున్నారు.

తాజాగా చెన్నైలో కొత్త శాసనసభ – సచివాలయ భవన సముదాయాన్ని నిర్మించనున్నట్లు గురువారం అసెంబ్లీలో ప్రకటించారు.

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సంచలన నిర్ణయాలతో దూసుకు పోతున్నారు. తాజాగా చెన్నైలో కొత్త శాసనసభ మిగతా 2లో

## ఉరిశిక్ష పడిన వ్యక్తికీ చివరిసారిగా చెప్పుకునే అవకాశం ఇస్తారు

**కేబినెట్ నుంచి కొండా సురేఖ బర్తరఫ్**

- 'రేవంత్ ఎప్పటికీ వైఎస్సార్ కాలేడు': కాంగ్రెస్‌లో కొనసాగడంపై కొండా సురేఖ స్పష్టత
- దేవాదాయ శాఖ మంత్రిగా తనను బర్తరఫ్ చేయడంపై కొండా సురేఖ స్పందించారు. తనను అన్యాయంగా పదవి నుంచి తొలగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.
- ఉరిశిక్ష పడిన వ్యక్తికీ చివరిసారిగా ఏదైనా చెప్పుకునే అవకాశం ఇస్తారని, తనకు మాత్రం ఎలాంటి అవకాశం ఇవ్వకుండా శిక్షించారని అన్నారు.



దేవాదాయ శాఖ మంత్రిగా తనను బర్తరఫ్ చేయడంపై కొండా సురేఖ స్పందించారు. తనను అన్యాయంగా పదవి నుంచి తొలగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఉరిశిక్ష పడిన వ్యక్తికీ చివరిసారిగా ఏదైనా చెప్పుకునే అవకాశం ఇస్తారని, తనకు మాత్రం ఎలాంటి అవకాశం ఇవ్వకుండా మిగతా 2లో

## ‘వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది’

అవసరమైతే ఎప్పుడైనా మరో దాడి చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఓవల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ట్రంప్.. తాజా ఘర్షణ ఎక్కువ కాలం సాగదని అభిప్రాయపడ్డారు. ఇరాన్ కదలికలపై అమెరికాకు పూర్తి సమాచారం ఉందన్నారు. “వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది” అంటూ అమెరికా నిఘా సామర్థ్యాన్ని వివరించారు. హర్మూజ్ జలసంధిపై తమకు బలమైన పట్టు ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఇరాన్ ఏర్పాటు చేస్తున్న రాడార్, క్షిపణి వ్యవస్థలను అమెరికా గుర్తించిందన్నారు. సముద్రంలో మైన్స్ వేసేందుకు ఇరాన్ సిద్ధం చేస్తున్న రాకెట్‌ను దాడిలో ధ్వంసం చేశామని చెప్పారు. తాజా అమెరికా దాడుల్లో ఇరాన్‌లో కనీసం 18 మంది చనిపోయారు. మరో 108 మంది గాయపడ్డారు. హర్మూజ్ సమీపంలోని కుహెస్తాక్‌లో జరిగిన వివాహ వేడుకపై కూడా దాడి జరిగినట్లు బ్రిటన్ తెలిపింది. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా ఎదురుదాడులకు దిగింది. కువైట్, జోర్డాన్, యూఏఈ, బహ్రెయిన్, ఇరాక్‌లోని కుర్దిస్తాన్ ప్రాంతాల్లో ఉన్న అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. కువైట్‌లో ఇరాన్ నుంచి వచ్చిన క్షిపణి, డ్రోన్ దాడిని అడ్డుకున్నట్లు అక్కడి సైన్యం తెలిపింది.

## నీటి సంరక్షణ సాంకేతికతలపై దృష్టిసారించాలి

జలంపై కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన జాతీయస్థాయి రెండు రోజుల కార్యక్రమం ముగింపు వేడుకలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. “పట్టణీకరణతో నగరాలు, పట్టణ ప్రాంతాల్లో జనాభా విపరీతంగా పెరిగిపోతోంది. వీళ్ల అవసరాలు తీర్చేలా పట్టణ ప్రణాళికలు నీటి సంరక్షణపై మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఈ మేరకు నీటి సంరక్షణ సాంకేతికతలు అమలుపై బాగా దృష్టిసారించాలి. అంతర్జాతీయంగా అమల్లో ఉన్న అత్యుత్తమ నీటి సంరక్షణ విధానాలు,సాంకేతికతలను నగర, పట్టణ కార్పొరేషన్లలో అమలుచేయాలి. ఈ సాంకేతికతలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చేలా, సంబంధిత ఉపకరణాలను స్థానికంగా తయారుచేసేలా భారతీయ పరిశ్రమలకు అవకాశాలను మెరుగుపరచాలి. జల సంరక్షణలో ప్రజా భాగస్వామ్యాన్ని విపరీతంగా పెంచాలి. పౌరుల్లో నీటిపై, నీటి వృథాను అరికట్టడంపై, నీటిని పొదుపుగా వాడుకోవడంపై మరింతగా అవగాహన పెంచేలా జలోత్సవ్ వంటి కార్యక్రమాలను నిర్వహించాలి. పట్టణ ప్రాంతాల్లోని చెరువులు, కాలువలు, జలవనరుల్లో చెత్త, వ్యర్థాలు పూడిక తీసే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు చేపట్టాలి. భూగర్భ జలాలు పెరిగేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషిచేయాలి. ఈ సదస్సును ఒకసారి చేపట్టేసి చేతులు దులుపుకోవడం కాకుండా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరాయంగా జరగాలి. జల సంరక్షణ విజయవంతంగా చేపడుతున్న ప్రాంతాలను ఉన్నతాధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు రాష్ట్రాలకతీతంగా సందర్శించి అవగాహన పెంచుకోవాలి. జల వనరులను ఎలా సంరక్షించుకోవాలో, నదీ?వినియోగం చేయాలనే దాని కోసం జల గణాంకాలను కృత్రిమ మేధ సాయంతో మేళవించి మెరుగైన పరిష్కారాలను కనుగొనాలి”అని మోదీ సూచించారు.

## కాంగ్రెస్‌ది 420 ప్రభుత్వం

మోసం చేసిన ‘420 ప్రభుత్వం’గా మిగిలిపోయిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల గొంతు కోసిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు.. ఇలా ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం మోసం చేసిందని ఆయన ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి తెచ్చారని, ఆరు డీఏలు, పీఆర్సీ, ఈహెచ్‌ఎస్ చెల్లింపుల్లో కాలయాపన చేస్తూ మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4,000 పెన్షన్, రైతులకు ఎకరానికి రూ.15 వేల సాయం, ఏటా 2 లక్షల ఉద్యోగాలు, రూ.4,000 నిరుద్యోగ భృతి హామీలను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. బీసీలకు ఏటా రూ.20 వేల కోట్లు ఇస్తామన్న హామీని నీరుగార్చారని, కుల గణన పేరుతో ముస్లింలను బీసీల్లో చేర్చి అసలైన బీసీలకు అన్యాయం చేశారని విమర్శించారు.

## అనకాపల్లికి గోదావరి జలాల పేరుతో చంద్రబాబు డ్రామా

పార్టీ నేతలు ఆక్షేపించారు. అసలు పోలవరం డ్యామ్ నిర్మాణం పూర్తి కాకుండా, రిజర్వాయర్‌లో అసలు నీటి నిల్వలే లేకుండా నీటిని విడుదల చేశామంటూ జలహారతులు ఇవ్వడం కేవలం ప్రచార ఆర్భాటం, ఈవెంట్ మేనేజ్‌మెంట్ తప్ప మరొకటి కాదని వారు స్పష్టం చేశారు. పోలవరం కాలువల తవ్వకం నుంచి భూసేకరణ, అనుమతుల వరకు 80 శాతం పనులను పూర్తి చేసిన ఘనత దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందని, ఆ తర్వాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. చంద్రబాబు చేసిన చారిత్రక తప్పిదాల వల్ల ప్రాజెక్టు ఆలస్యమైందని, ఇప్పుడు పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా తెచ్చిన గోదావరి జలాలను పోలవరం నీళ్లుగా చూపిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. గడిచిన రెండున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలో నడుస్తున్నది పాలన కాదు, కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఈవెంట్ మేనేజ్‌మెంట్ మాత్రమే. పోలవరంలో 2014--19 మధ్య చంద్రబాబు చేసిన డిజైన్ లోపాలు, డయాఫ్రమ్ వాల్ వైఫల్యాలను సరిదిద్దడానికే జగన్ మోహన్ రెడ్డి గారి ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టింది. నాడు సాక్షాత్తూ ప్రధాని మోదీ గారే పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంలా వాడుకున్నారని ఆరోపించారు. ఎడమ కాలువ కోసం 6200 ఎకరాలు, కుడి కాలువ కోసం 6000 ఎకరాల భూసేకరణ జరిపి, 80 శాతం కాలువ పనులు పూర్తి చేసింది దివంగత నేత వైఎస్సార్. 193 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 38 లక్షల ఎకరాలకు నీరివ్వాలన్నది వైఎస్సార్ లక్ష్యం. కానీ చంద్రబాబు 2024లో కేంద్రం వద్ద మోకరిల్లి ప్రాజెక్టు ఎత్తును 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు కుదించడానికి అంగీకరించి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును నిలువునా సమాధి చేశారు.పోలవరంలో 45 మీటర్ల నీరు నిలబడితేనే గ్రావిటీ ద్వారా ఉత్తరాంధ్రకు నీరు వస్తుంది.అనకాపల్లి జిల్లాలో 55 వేల హెక్టార్లలో వరి సాగు జరగాల్సి ఉండగా, తీవ్ర వర్షాభావం వల్ల సెప్టెంబర్ నాటికి కేవలం 5 వేల హెక్టార్లలోపే నాట్లు పడ్డాయి. అలాంటి పరిస్థితుల్లో జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి, అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాల్సింది పోయి జగన్ గారిపై విషం చిమ్మడానికే సమయం కేటాయించారు. చోడవరం షుగర్ ఫ్యాక్టరీ రైతులకు బకాయిలు చెల్లించలేకపోయారు. నర్సీపట్నంలో 30 శాతం పనులు పూర్తయిన మెడికల్ కాలేజీని నిలిపివేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టు, గ్రీన్ హైడ్రోజన్ హబ్, విజయనగరం మెడికల్ కాలేజీలను జగన్ గారు తీసుకొస్తే... చంద్రబాబు మాత్రం ఉత్తరాంధ్రను దోచుకోవడానికే పరిమితమయ్యారు.

## లోకేష్ వెంటనే రాజీనామా చేయాలి

స్పోర్ట్స్ కోటా, పేపర్ లేకేజి ఆరోపణలపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గురువారం విశాఖలో వరుదు కళ్యాణి మీడియా సమావేశం నిర్వహించారు. కర్నూలు ప్రభాకర్ గౌడ్ కు టెట్ అర్హత లేకుండా టీచర్ పోస్ట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. చర్చకు రావాలని సవాల్ విసరడం కాదు దమ్ముంటే డీఎస్సీ అంశంపై ఇప్పుడు మాట్లాడాలి. వైఎస్సార్సీపీ మొదటి నుంచి చెబుతున్నదే నిజమైంది. డీఎస్సీలో ఇంకెన్ని అక్రమాలు జరిగాయో తేలాలని స్పష్టం చేశారు. డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి లోకేష్ వెంటనే రాజీనామా చెయ్యాలని ఈ అంశంపై సీఎం చంద్రబాబు దీనిపై స్పందించాలని వరుదు కళ్యాణి డిమాండ్ చేశారు..

## ఏపీలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలోని రెండవ బ్లాక్‌లో మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన టూరిజం డిపార్ట్‌మెంట్ మార్కెటింగ్ కమిటీ ప్రమోషన్ మీటింగ్ లో ఏడాదంతా పర్యాటక శోభ ఉట్టిపడేలా జిల్లా స్థాయి పర్యాటక ఉత్సవాలు, రోడ్‌షోలు నిర్వహించాలని సూచించారు.. జిల్లాల నుండి అందిన 28 ప్రతిపాదనలకు అనుగుణంగా తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా ఉత్సవాలకు రూపకల్పన చేయాలన్నారు. సెప్టెంబర్ 27న ‘వరల్డ్ టూరిజం డే’ వేడుకల నిర్వహణ, రాబోయే గోదావరి పుష్కరాలకు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు, భక్తుల సౌకర్యార్థం పర్యాటక శాఖ తరఫున అత్యాధునిక టెంట్ సిటీల ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గోదావరి పుష్కరాలు-2027 సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో దేశవిదేశాల నుంచి తరలివచ్చే కోట్లాది మంది భక్తులు, పర్యాటకుల కోసం రూపొందించిన విస్తృత స్థాయి బ్రాండింగ్, మార్కెటింగ్ కార్యాచరణను అధికారులు మంత్రి దుర్గేష్ కు అందించారు. యాత్రికుల సౌకర్యార్థం పిలిగ్రిమ్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్, సర్క్యూట్ మ్యాప్స్, ఆకర్షణీయమైన బ్రోచర్లు, సమగ్ర వివరాలతో కూడిన కంటెంట్ తయారు చేయాలని సూచించారు. గోదావరి నది ప్రాశస్త్యాన్ని,పరివాహక ఆధ్యాత్మిక ప్రాంతాల ప్రాధాన్యతను, చారిత్రక ఘాట్ల విశిష్టతను చాటేలా వినూత్న డిజిటల్ కంటెంట్, సోషల్ మీడియా ప్రచారాలు, స్టోరీ టెల్లింగ్ కార్యక్రమాలు రూపొందించాలన్నారు. టూర్ ఆపరేటర్లతో ప్రతి నెలా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించడం, హోటల్ అండ్ హాస్పిటాలిటీ వర్క్‌షాప్‌ల ఏర్పాటుపై అధికారులు సూచించగా మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలను తక్షణమే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.ఈ ఉన్నత స్థాయి సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్. రావత్, టూరిజం ఎండీ పట్టాన్ శెట్టి రవిసుభాష్, సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్, సినిమాటోగ్రఫీ ఎండీ విశ్వనాథన్, ఏపీటీఏ సీఈవో శ్రీనివాస్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లిఖార్జునరావు, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ విజయలక్ష్మి, చీఫ్ మార్కెటింగ్, ఫైనాన్స్ అధికారులు పద్మారాణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో హెలీ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వారిద్దరూ చర్చించారు.

డిఫెన్స్ ఎక్స్‌పోలో లైవ్ డెమోలు...

ఏరోస్పేస్, రక్షణ, అంతరిక్ష రంగాలపై ప్రత్యేక సదస్సుతోపాటు ఎయిర్ షో, ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్, భూఉపరితల రక్షణ వ్యవస్థలకు సంబంధించిన లైవ్ డెమోలు డిఫెన్స్ ఎక్స్‌పోలో ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి రాజ్‌నాథ్‌కు వివరించారు. ఈ దృష్ట్యా డిఫెన్స్ ఎక్స్‌పోకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని, ఆహూతులకు మార్గనిర్దేశం చేయాలని కోరారు. ఎయిర్ షో నిర్వహణకు గగనతల అనుమతుల మంజూరు చేయాలని.. యుద్ధ విమానాల భాగస్వామ్యంతో పాటు సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాల ప్రదర్శనలు ఉండేలా ఆదేశాలివ్వాలని విన్నవించారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా మద్దతు అందించాలన్నారు. త్రివిధ దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థల డెమోలను ఈ ఎక్స్‌పోలో ఏర్పాటు చేయాలని కోరారు.

రక్షణ శాఖ కోరినట్లుగా భూసేకరణ...

ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణ గురించి రాజ్‌నాథ్ సింగ్, రేవంత్‌రెడ్డి మధ్య చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాల భూమిని సేకరించిందని రేవంత్ చెప్పారు. ఈ విమానాశ్రయం కోసం రక్షణ శాఖ మొత్తం 1,500 కోరిందని.. ఆ మేరకు మరో 750 ఎకరాల భూసేకరణ ప్రక్రియ చేపడతామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ప్రాజెక్టు కోసం 416.18 ఎకరాలను నామమాత్రపు రుసుముతో 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన కేటాయించనున్నట్లు రాజ్‌నాథ్‌కు సీఎం వివరించారు.

విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలి...

ఆదిలాబాద్, మామూనురు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో బుధవారం ఆయన్ను పార్టీ ఎంపీలు, అధికారులతోపాటు వెళ్లి కలిశారు. మామూనూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణను పూర్తి చేసి కేంద్రానికి అప్పగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్‌తోపాటు మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్ (ఎంఆర్‌వో) వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆదిలాబాద్‌లో రన్‌వే విషయంలో తుది నిర్ణయానికి సంబంధించి రక్షణ, పౌర విమానయాన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో ఆహ్వానిస్తామని చెప్పారు. డిసెంబర్ నాటికి ఖరారు చేసి పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ కోరారు. హుస్సేన్‌సాగర్‌లో సీప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన అధికారులు సీఎంకు తెలియజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి ప్రాజెక్టుల కార్యసాధకుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డేనని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. పోలవరం, ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టుల పనులను వైఎస్సారే ప్రారంభించారని గుర్తుచేశారు. తెలంగాణ రైతుల కష్టాలు తీర్చేందుకు ఆయన తలపెట్టిన ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టుతోపాటు కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులు ప్రస్తుతం ఆగిపోయాయని.. అయితే ఆయన కలగన్న ఆ ప్రాజెక్టులను పూర్తిచేసి తెలంగాణ ప్రజలకు అంకితమిస్తానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం సాయంత్రం ఢిల్లీలో జరిగిన డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి అవార్డు--2026 ప్రదానోత్సవ కార్యక్రమానికి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్ జీవితాంతం ప్రజాశ్రేయస్సు కోసం శ్రమించారని.. 2003లో చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు ఎర్రటి ఎండల్లో సుదీర్ఘ పాదయాత్ర నిర్వహించిన ఆయన నాడు ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ముఖ్యంగా కాలిపోతున్న మోటార్లు, పేలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు, ఎండిపోతున్న పంటలతో అష్టకష్టాలు పడుతున్న రైతులకు ఉచిత విద్యుత్ హామీ ఇచ్చి 2004లో సీఎం అయ్యాక ఆ పథకంపై తొలి సంతకం చేసి మాట నిలబెట్టుకున్న మహనీయుడని ప్రశంసించారు. దాదాపు రూ. 1,300 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేయడమే కాకుండా అప్పటికి రైతులపై ఉన్న వేలాది అక్రమ కేసులన్నింటినీ తొలగించిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు.

## సోషల్ మీడియాలో జెన్ జీ క్రియాశీలకం

ప్రభుత్వానికి సంబంధించిన శంకు స్థాపనలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవడం తీవ్రమైన పొరపాటని, ఇది ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఫొటోను ముద్రించకపో వడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా కఠిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో, అత్యంత సంక్లిష్టమైన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ పనులను సమర్థవంతంగా పూర్తి చేసిన జలవనరుల శాఖ, ఆర్థిక శాఖ అధికారుల సమన్వయాన్ని సీఎం అభినందించారు. మంత్రి నిమ్మల రామానాయుడు నిత్యం ప్రాజెక్టుల వద్దే ఉంటూ, ఎంతో నిరాడంబరతతో పనిచేస్తూ ఫలితాలు సాధిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటవుతోందని చెప్పారు. ఆంధ్ర పాప్‌కార్న్, అరకు కాఫీ ఉత్పత్తులను రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు.రాష్ట్రంలో తీవ్రరూపం దాలుస్తున్న ఎల్‌నినో పరిణామాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. గడిచిన 30 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా అత్యంత స్వల్ప వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశం జిల్లాలో 70 శాతం మేర తీవ్ర వర్షపాత లోటు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులపై ఈరోజే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఒక్క ఎకరా పంట కూడా ఎండిపోకూడదని, భూగర్భ జలాల ఆధారంగా అవసరమైతే అదనపు బోర్లు వేసేందుకు తక్షణ అనుమతులు ఇవ్వాలని ఆన్నారు.సమన్వయ లోపంతో వివిధ కార్యక్రమాలకు ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతుండటంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవటం సరికాదన్నారు. వెలిగొండ, పోలవరం ఎల్‌ఎంసీ ప్రకటనల్లో మంత్రి రామానాయుడు ఫొటో లేకపోవటాన్ని ఆయన తప్పుబట్టారు. తప్పులు పునరావృతం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెలిగొండ ప్రారంభానికి జలవనరుల శాఖ, ఆర్థిక శాఖ సమన్వయంతో పని చేశాయన్నారు. రామానాయుడు సింప్లిసిటీ మెయింటైన్ చేస్తూ పని బాగా చేశారంటూ అభినందించారు. దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటు కానుందని.. ఆంధ్ర పాప్ కార్న్, అరకు కాఫీ ప్రతి గ్రామానికి విస్తృతంగా వెళ్లాలని సూచించారు.ఏపీలో ఎల్‌నినో పరిస్థితులను వివరిస్తూ ఈరోజే కేంద్రానికి లేఖ రాయనున్నట్లు సీఎం తెలిపారు. ప్రతినెలా క్షేత్రస్థాయి పరిస్థితులు కేంద్రానికి నివేదిద్దామన్నారు. అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశంలో 70 శాతం మేర లోటు వర్షపాతం ఉందన్నారు. గత 30ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా అతి తక్కువ వర్షపాతం ఈసారి నమోదైందని చెప్పారు. తాగునీరు అందించటం, పశుగ్రాసానికి లోటు లేకుండా చూడటం, సీడ్ బాల్స్ విషయంలో మంత్రులంతా కార్యోన్ముఖులై పని చేయాలని సూచించారు. తాగునీటికి ఎంతైనా ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అవకాశం ఉన్న చోట నీటి స్టోరేజ్‌కు చర్యలు చేపట్టాలని తెలిపారు.గ్రౌండ్ వాటర్‌ను అంచనా వేస్తూ అవసరం అనుకుంటే అదనంగా బోరు వేసేందుకు అనుమతినిద్దామని ముఖ్యమంత్రి అన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఒక్క ఎకరా కూడా ఎండటానికి వీల్లేదన్నారు. తాగు నీటిని రవాణా చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో జీఎస్‌డీపీ తగ్గకుండా చర్యలు తీసుకోవాలని.. ప్రతి మంత్రివర్గంలో ఎల్‌నినో ప్రభావంపై సమీక్షిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం ముగిసింది. ప్రధానంగా ఎల్‌నినోపైనే కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. మైనస్ 52 శాతంలో వర్షాలు నమోదయ్యాయని.. తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలని, సీడ్ బాల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను కేబినెట్ ఆదేశించింది. పశుగ్రాసంపై దృష్టి పెట్టాలని కోరింది. కరవు పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం నుంచి ఏ విధంగా నిధులు రాబట్టాలనే అంశంపైనా మంత్రివర్గంలో చర్చించినట్లు తెలుస్తోంది.వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీరు ఇవ్వడంపై ఆనందంగా ఉందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. సీఎం కేబినెట్‌లోకి రాగానే అందరూ లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలియజేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజినీరింగ్ అధికారులను ముఖ్యమంత్రి అభినందించారు. మంత్రులందరూ ప్రజలలోకి వెళ్లాలని చెప్పారు. ‘మనం ఇన్ని పనులు చేస్తున్నాం.. వీటన్నింటినీ ప్రజలకు చెప్పుకోవాలి. కొత్త జనరేషన్ జెన్ జీ అన్ని విషయాలపై అవగాహనతో ఉంది. వాళ్లు సోషల్ మీడియాలో క్రియాశీలకంగా ఉన్నారు. మనం కూడా అందుకు తగినట్టుగా సిద్ధమవ్వాలి. మనం చేస్తున్న మంచిని జెన్ జీ వద్దకు తీసుకువెళ్లాలి’ అని సూచించారు.వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రులతో చంద్రబాబు అన్నారు. తప్పుడు, ఫేక్ ప్రచారాలు చేయడంలో వైసీపీ ముందు ఉంటుందని విమర్శించారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై కూడా వైసీపీ సిగ్గు లేకుండా దుష్ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్ట్ పూర్తైనా అది కూటమి ప్రభుత్వం చేసిందే అని.. ఈ విషయం ప్రజలు కూడా గమనిస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను కూడా అదుపు చేయాలన్నారు. దీనిపై ఉన్న కేబినెట్ సబ్ కమిటీ ధరలపై జాగ్రత్తగా ఎప్పటికప్పుడు గమనించాలని అన్నారు.

## ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోంది

పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు. మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న ‘గొడ్డలి రాజకీయాల’ కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు.మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయని, వాయిదా వేసే ప్రసక్తే లేదని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అమరావతిలో టీడీపీ మంత్రులతో ఆయన బ్రేక్‌ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పార్టీ నాయకులకు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ నాటికి పూర్తవుతుందని లోకేశ్ వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసి, అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.స్థానిక సంస్థల ఎన్నికలు దశలవారీగా జరుగుతాయని లోకేశ్ తెలిపారు. ముందుగా మునిసిపల్ ఎన్నికలు జరుగుతాయని, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు, ఆపై పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించుకుని, అన్ని స్థానాల్లోనూ ఎన్నికలు జరిగేలా శ్రమిస్తున్నామని తెలిపారు. వైసీపీ హయాంలో నిలిచిపోయిన అర్హులందరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లను మంజూరు చేస్తామన్నారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు.ఎన్నికలు వాయిదా పడాలంటూ ప్రతిపక్ష వైసీపీ పన్నుతున్న కుయుక్తులు, కుట్రలు ఎట్టిపరిస్థితుల్లోనూ పారవని లోకేశ్‌హెచ్చరించారు. ఎన్నికలు వాయిదా పడితే కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నుంచి వచ్చే నిధులు ఆగిపోతాయనే దురుద్దేశంతోనే ప్రతిపక్షం కోర్టు కేసులతో అడ్డంకులు సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. అయితే ప్రభుత్వం చట్టపరమైన చిక్కులన్నింటినీ అధిగమించి, అనుకున్న సమయానికే స్థానిక ఎన్నికలను పూర్తి చేసి తీరుతుందని నారా లోకేశ్ స్పష్టం చేశారు.

## ఉరిశిక్ష పడిన వ్యక్తికీ చివరిసారిగా చెప్పుకునే అవకాశం ఇస్తారు

శిక్షించారని అన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత పటేల్ వ్యాఖ్యలకు తనను శిక్షించడం ఏంటని.. ఆమె అభిప్రాయంతో తనకేం సంబంధమని కాంగ్రెస్ పెద్దలను సురేఖ సూటిగా ప్రశ్నించారు. రాజీనామా చేయమంటే చేసేదాన్నని, తన వివరణ అడిగి చర్యలు తీసుకుంటే బాగుండేదన్నారు. నిజంగా తాను తప్పు చేసి ఉంటే బర్తరఫ్ చేసినా పర్వాలేదని కొండా సురేఖ చెప్పుకొచ్చారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ‘మంత్రి పదవి నాకు ఆభరణం మాత్రమే. కారణం చెప్పకుండా తొలగించడం బాధాకరం. గతంలో మంత్రి పదవికి స్వయంగా నేనే రాజీనామా చేశా. ప్రస్తుతం మంత్రులు సంతోషంగా లేరు. ఈ విషయం గుండెపై చేయి వేసుకొని వారు చెప్పాలి. మంత్రులంతా బయటకు వచ్చి మాట్లాడాలి. పనులు కావాలంటే ఎవరి వద్దకు వెళ్లాలో అర్థం కాదు. ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని కోరుతున్నాను. నేను పార్టీని, ప్రభుత్వాన్ని ఏం అనలేదు. మల్లు రవి కూడా ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీని తిట్టినవారే. ఇందిరాగాంధీని జైపాల్ రెడ్డి తిట్టారు. రోశయ్య సైతం ఇందిరాగాంధీని తిట్టారు. సీఎం రేవంత్‌పై ఆరోపణలు చేసిన వారికీ పదవులు ఇచ్చి సన్మానం చేశారు.ఎవరి అండ లేకుండా మేం పైకి వచ్చాం. నా భర్తను కారులో ఎక్కించుకొని వరంగల్ అంతా తిప్పారు. మా కాళ్లు మొక్కి మాతో ప్రచారం చేయించుకున్న వాళ్లూ మమ్మల్ని తిడుతున్నారు. మా నియోజకవర్గంలో ఉన్న ఎమ్మెల్సీకి వాళ్ల భార్య కూడా ఓటేయదు. నన్ను తొలగించాలనే ఆలోచన ఏఐసీసీకి లేదు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసి నన్ను బర్తరఫ్ చేశారు. వేం, పొంగులేటి, తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డి ఏకమై నన్ను ఇబ్బంది పెట్టారు. డబ్బులు వసూలు చేసిన వాడే నా మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కేసు పెట్టాడు. సుమంత్ పేరు చెప్పి కిరణ్ అనే వ్యక్తి డబ్బులు వసూలు చేశాడు. తమ ప్రభుత్వంలో తమ మనుషులను ఇబ్బంది పెట్టుకోవడం చరిత్రలో ఎక్కడా లేదు. సుమంత్‌ని ఇబ్బంది పెట్టడం ఆపేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా. కాంగ్రెస్ సర్కార్ సరిదిద్దుకోవాల్సిన, మార్చుకోవాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి.ప్రభుత్వం మళ్లీ రావాలంటే చాలా మార్పులు జరగాలి. మోనోపాలీ లాగా వెళ్లడం సరైంది కాదు. తనకు తానే ముఖ్యమంత్రి అని చెప్పుకోవడం సరికాదు. నిర్ణయాలు తీసుకునేప్పుడు చర్చించాలి. ఎమ్మెల్యేగా ఉంటాను.. నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తాను. నాకు పార్టీలో ఇబ్బంది అవుతుందని అనుకుంటున్నా. నా కూతురు వ్యాఖ్యలను నేను ఖండిస్తే ఆమెను కించపరిచినట్టు అవుతుంది. మంత్రిగా తొలగించడం అవమానమని అనుకోవడం లేదు. నేను తప్పు చేస్తే ఇబ్బంది పడేదాన్ని. తప్పు చేయకుండా బర్తరఫ్ చేయడం పార్టీ తప్పు. రేవంత్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డికి తేడా ఉంది’ అని అన్నారు.కేబినెట్ నుంచి తనను బర్తరఫ్ చేయడంపై కొండా సురేఖ తీవ్రంగా స్పందించారు. తాను ఎలాంటి తప్పు చేయకున్నా తనపై వేటు వేశారని, కనీసం వివరణ తీసుకునే అవకాశం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ఆయన పరిపాలనా శైలిపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి పాలనలో నాయకులకు, ప్రజలకు నిరంతరం ప్రాధాన్యం ఉండేదని కొండా సురేఖ గుర్తుచేశారు. ప్రజలతో, పార్టీ నేతలతో వైఎస్సార్ ఉన్నట్లుగా సీఎం రేవంత్ రెడ్డికి అసలు కమ్యూనికేషన్ లేదని.. ఆయన నాయకులతో సరిగ్గా మమేకం కావడం లేదని విమర్శించారు. “నేను ఎలాంటి తప్పూ చేయకున్నా నన్ను పదవి నుంచి బర్తరఫ్ చేశారు.

## చెన్నైలో ‘ఒలింపిక్ సిటీ’.. ఫార్ములా-1 ట్రాక్.!

- సచివాలయ భవన సముదాయాన్ని నిర్మించనున్నట్లు గురువారం అసెంబ్లీలో ప్రకటించారు. ఈ నిర్మాణం రాబోయే 100 సంవత్సరాల వరకు ఉపయోగ పడేలా ఉంటుందని ఆయన తెలిపారు.అసెంబ్లీలో రూల్ 110 కింద అనేక ప్రకటనలు చేస్తూ, తమిళనాడు ఒలింపిక్ సిటీని, చెన్నైలో మోటార్ స్పోర్ట్స్ సిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని సీఎం ప్రకటించారు. రాష్ట్ర మౌలిక సదుపాయాలను ప్రపంచ స్థాయికి పెంచడానికి ముఖ్యమంత్రి మూడు ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలను ప్రకటించారు.ప్రస్తుతం ఫోర్ట్ సెయింట్ జార్ కాంప్లెక్స్ తమిళనాడు ప్రభుత్వ శాసనసభ , సచివాలయంగా పనిచేస్తోంది. సీఎం విజయ్ ఆధ్వర్యంలో రానున్న కొత్త సెక్రటేరియట్ అంచనా వ్యయం రూ. 1,200 కోట్లుగా భావిస్తున్నారు. 20 లక్షల చదరపు అడుగులవిస్తీర్ణంలో ఇది రూపుదిద్దుకోనుంది. కొత్త కాంప్లెక్స్ నిర్మాణం కోసం ప్రభుత్వం పట్టణపాక్కం, నందంబాక్కం, కోయంబేడు మరియు గిండిలోని హైవేస్ డిపార్ట్‌మెంట్ ఆఫీస్ ప్రాంగణాలను ఎంపిక చేసింది. గతంలో మాజీ ముఖ్యమంత్రులు జయలలిత, ఎం. కరుణానిధి కూడా అసెంబ్లీ, సచివాలయాలను వేరే చోటికి మార్చాలని ప్రతిపాదించినప్పటికీ, దశాబ్దాలుగా ఫోర్ట్ సెయింట్ జార్జ్ ప్రాంగణమే పాలనా కేంద్రంగా కొనసాగుతోంది.తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చెన్నై నగరాన్ని ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సెంటర్‌గా తీర్చిదిద్దే దిశగా ముందడుగు వేసింది. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలోని 110వ నిబంధన కింద ఒలింపిక్ సిటీని ఏర్పాటు చేయనున్నట్టు సీఎం జోసెఫ్ విజయ్ ప్రకటించారు. రాష్ట్ర క్రీడా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఈ ప్రాజెక్టులో ప్రపంచ స్థాయి క్రీడా వేదికలు, ఆధునిక శిక్షణ పరికరాలు, హై పర్ఫార్మెన్స్ ట్రైనింగ్ సెంటర్, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్ కేంద్రాలు వంటివాటిని నిర్మించనున్నట్టు పేర్కొన్నారు.అంతేకాకుండా క్రీడాకారులు, కోచ్‌ల కోసం వసతి సదుపాయాలతో కూడిన సమగ్ర క్రీడా కేంద్రంగానూ చెన్నైని అభివృద్ధి చేయనున్నట్టు తెలుస్తోంది. దేశంలోకి ఫార్ములా వన్ రేసింగ్‌ను తిరిగి తీసుకురావడం సహా అంతర్జాతీయ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించేలా అత్యుత్తమ శిక్షణ, సహాయక సదుపాయాలు కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకోసం దేశంలో మోటార్ స్పోర్ట్స్‌ను పర్యవేక్షించి, మంత్రిత్వ శాఖకు నివేదిక సమర్పించేందుకు ఓ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటుచేశాం’ అని యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ తెలిపింది.అదే సమయంలో చెన్నైలో ప్రత్యేకంగా మోటార్ స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేసి ఫార్ములా-1 నుంచి ఎఫ్-4 వరకు రేసులు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.

# వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలి

## వృద్ధులకు సేవ చేయడం ఎంతో గొప్ప విషయం : డాక్టర్ శంకర్ శర్మ

**కర్నూలు వైద్యం, సెప్టెంబర్ 03, (సీమకిరణం న్యూస్) :** ప్రస్తుత పరిస్థితుల్లో వృద్ధాశ్రమాల నిర్వహణ ఎంతో భారంగా మారిందని ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు సమీపంలోని ప్రజానగర్ ఎదురుగా కాదంబరి టౌన్‌షిప్‌లో ఉన్న సేద వృద్ధాశ్రమానికి కెంట్ ప్యూరిటీ వాటర్ ఫిల్టర్‌ను డాక్టర్ శంకర్ శర్మ తనవంతు సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. అమెరికాలో స్థిరపడిన మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో గత ఇరవై సంవత్సరాలుగా సేద వృద్ధాశ్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వాటర్ ఫిల్టర్‌ను అందజేసినట్లు తెలిపారు. కలుషిత నీరు తాగడం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అందుకే ప్యూరిఫైడ్ వాటర్ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ సహాయం చేసినట్లు పేర్కొన్నారు





### ఎల్‌నీనో ప్రభావంతో పెరిగిన నిర్వహణ భారం

ప్రస్తుతం ఎల్‌నీనో ప్రభావంతో పాటు ప్రపంచంలోని పలు దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. దీంతో వృద్ధాశ్రమాల నిర్వహణ మరింత కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సేద వృద్ధాశ్రమానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. దాతలు ముందుకు వచ్చి తమకు తోచినంత మేర వృద్ధాశ్రమాలకు ఆర్థిక, వస్తు రూపంలో సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

### తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపడం సరికాదు

తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపడం సరికాదని డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. జీవిత చరమాంకంలో ఉన్న తల్లిదండ్రులను పిల్లలు ప్రేమగా, ఆప్యాయంగా చూసుకోవాలని సూచించారు. చిన్నతనంలో పిల్లల కోసం ఎన్నో త్యాగాలు చేసిన తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో తోడుగా నిలవడం ప్రతి కుమారుడు, కుమార్తె బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేద వృద్ధాశ్రమ నిర్వాహకులు దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

## శివ సాయి స్కూల్లో ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



**ప్యాపిలి, సెప్టెంబర్ 3 (సీమ కిరణం న్యూస్):** స్థానిక శివ సాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి శుక్రవారం సెలవు దినం కావడంతో ఒక రోజు ముందుగానే వేడుకలను నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణలు, శ్రీకృష్ణుడి అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం చిన్నారుల చేత ఉట్టి కొట్టించే కార్యక్రమాన్ని నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలో కృష్ణాష్టమి సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆలా శ్రీదేవి, ఉపాధ్యాయులు పద్మావతి, సంధ్యారాణి, మహేశ్వరి, సుష్మ, పుష్ప, సుమిత్ర, కృష్ణవేణి, రామకృష్ణమ్మ, రాజేష్, హరిత, ప్రసన్న, ఆర్. సంధ్య, శ్రీవిద్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## డోన్ పురపాలక సంఘం ఓటర్ల జాబితా ఆవిష్కరణ



**డోన్ టౌన్, సెప్టెంబర్ 03,(సీమ కిరణం న్యూస్):** డోన్ పురపాలక సంఘం పరిధిలో మున్సిపల్ సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా 36 వార్డుల వారీగా ఓటర్ల జాబితాను గురువారం మున్సిపల్ కార్యాలయంలో అధికారికంగా మున్సిపల్ కమిషనర్ ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, మున్సిపల్ డీఈ , టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. మున్సిపల్ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా వార్డు వారీ ఓటర్ల జాబితాను ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచడం జరిగిందని కమిషనర్ తెలిపారు.


## గణేశ్ మండపాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు!





**వెల్దుర్తి, సెప్టెంబర్ 3 (సీమకిరణం న్యూస్):** కర్నూలు జిల్లా వెల్దుర్తిలో వినాయక చవితి వేడుకల సందర్భంగా గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతులు పొందేందుకు ఆన్‌లైన్‌లో ఏకగవాక్ష విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు డీజీపీ హరీశ్‌కుమార్ తెలిపారు. పోలీస్, అగ్నిమాపక, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన అనుమతులన్నీ ఒకేచోట పొందేలా ఈ విధానాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండపాల ని ం ా ్ వ ఎ ్ ా డ ్ ు ల ు https://ganeshutsav.net/ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులోని వివరాలను అధికారులు పరిశీలించిన అనంతరం అవసరమైతే మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైన మార్పులపై సూచనలు చేస్తారని తెలిపారు.వెల్దుర్తి పట్టణంలో గణేశ్ మండపాలకు నాలుగు రోజులపాటు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు రోజులపాటు అనుమతులు ఇవ్వనున్నట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యుగేందర్ తెలిపారు. ప్రతి గణేశ్ మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలని ఎస్సై నరేష్ కోరారు.వినాయక చవితి వేడుకల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి ఆటంకం కలిగించినా, నిబంధనలు ఉల్లంఘించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ యుగేందర్, ఎస్సై నరేష్ హెచ్చరించారు. భక్తులు, నిర్వాహకులు పోలీసులకు సహకరిస్తూ వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని అన్నారు

## ఆత్మకూరు డీఈఈగా శ్రీనివాసులు రెడ్డి



**నెల్లూరు, ఆత్మకూరు, సెప్టెంబర్ 03, (సీమకిరణం న్యూస్) :** ఆత్మకూరు విద్యుత్ శాఖ నూతన డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ)గా శ్రీనివాసులు రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గూడూరు డివిజన్ కార్యాలయం నుంచి బదిలీపై ఆత్మకూరుకు వచ్చిన ఆయన గురువారం విధుల్లో చేరారు. అనంతరం విద్యుత్ సిబ్బందితో సమావేశమై ఈ ప్రాంతంలోని విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన విద్యుత్ సేవలు అందిస్తానని తెలిపారు. ఇక్కడ పనిచేసిన చిన్నస్వామి నాయక్ కోటవాకాడ కు బదిలీపై వెళ్లారు. నూతన డీఈ శ్రీనివాస్ రెడ్డి కు విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది ఘనంగా ఆహ్వానించి అభినందన శుభాకాంక్షలు తెలిపారు.

## రైతు స్వయం నిర్ణయాధికారిగా మారాలి







**వెల్దుర్తి, సెప్టెంబర్ 3( సీమకిరణం న్యూస్ ):** కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం లో రైతులు వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను అవలంబిస్తూ స్వయం నిర్ణయాధికారులుగా ఎదగాలని పత్తికొండ సహాయ వ్యవసాయ సంచాలకులు మోహన్ విజయ్ కుమార్ సూచించారు. వెల్దుర్తి మండలం నర్లాపురం గ్రామంలో గురువారం కొర్ర పంటపై సమీకృత పురుగు నివారణ పద్ధతుల పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సలహాలు, సూచనలను పాటించడం ద్వారా పంటల సాగులో స్వయంగా సరైన నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకోవచ్చని మోహన్ విజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విత్తన శుద్ధి, విత్తన మొలక శాతం పరీక్ష, పర్యావరణహిత పురుగుల నివారణకు వేపగింజల కషాయం తయారీపై రైతులకు ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం రైతులను బృందాలుగా విభజించి పంటల పర్యావరణ పరిస్థితులను పరిశీలించే కార్యక్రమం చేపట్టారు. కొర్ర పంటను సుస్థిరంగా సాగు చేయాలంటే పర్యావరణహిత పంటల నిర్వహణ పద్ధతులతో పాటు సమగ్ర పంట నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. రసాయన పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, సహజ పద్ధతుల ద్వారా పంటలను రక్షించుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు సమీకృత పురుగు నివారణ పరికరాల సముదాయాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ సహాయ వ్యవసాయ సంచాలకులు మోహన్ విజయ్ కుమార్, వెల్దుర్తి మండల వ్యవసాయ అధికారి ఆర్. అక్బర్ బాషా, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి, రైతు ఉత్పత్తిదారుల సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, రైతులు పాల్గొన్నారు.

## డి ఎ డబ్ల్యూ జె యు పై తప్పుడు ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలి



**డోన్ టౌన్, సెప్టెంబర్ 03,(సీమ కిరణం న్యూస్):** డోన్ అక్రెడిటేషన్ జర్నలిస్టు యూనియన్ నాయకులు సభ్యులు గురువారం ఉదయం అక్రెడిటేషన్ జర్నలిస్టు యూనియన్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి పై తగిన చర్యలు తీసుకోవాలని డోన్ డి యస్ పి శ్రీనివాసులు పిర్యాదు చేశారు, యూనియన్ నాయకులు శేఖర్ మాట్లాడుతూ మా యూనియన్ గురించి తప్పుడు ప్రచారం చేసి, అసత్యమైన ఆరోపణలు చేశారు, ఈ తప్పుడు ప్రచారం చేయడం వలన మా యూనియన్ కు ప్రతిష్టకు భంగం కలగడమే కాకుండా సభ్యులకు, మరియు ప్రజలలో అపోహలు ఎర్పడుతున్నవి, తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తి పై ఆధారాలు తో డి యస్ పి శ్రీనివాసులు కు పిర్యాదు చేశామని , ఆ వ్యక్తి పై తగిన చర్యలు తీసుకోవాలని డి యస్ పి ని కోరారు, ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సభ్యులు పాల్గొన్నారు. రైల్వే ప్రయాణికులకు తీపి కబురు..

## సికింద్రాబాద్ -- సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య ప్రత్యేక రైళ్లు!




ఈ ప్రత్యేక రైళ్లలోని అన్ని కోచ్‌లు అన్ రిజర్వ్‌డ్ (ఖఅతీవంవతీజవఎ) విభాగానికి చెంది నవి. అందుకే ప్రయాణికులు సాధారణ కౌంటర్ల వద్ద లేదా ఖూ యాప్ ద్వారా జనరల్ టికెట్ తీసుకుని ప్రయాణించవచ్చు. రద్దీని తట్టుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ రైలు. రైలు ప్రయాణికుల అదనపు రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే (ూజ=) కీలక నిర్ణయం తీసుకుంది. ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్ -- సిర్పూర్ కాగజ్‌నగర్ -- హైదరాబాద్ మార్గంలో రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రత్యేక రైళ్లు రేపు, అంటే 04 సెప్టెంబర్ 2026 న తమ సర్వీసులను అందిస్తాయి. రైలు నంబర్ 07235 - సికింద్రాబాద్ -- సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్యాహ్నం 12:10 బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు చేరుకుంటుంది. అలాగే రైలు నంబర్ 07236 -- సిర్పూర్ కాగజ్‌నగర్ -- హైదరాబాద్‌కు సాయంత్రం 6 గంటలకు బయలుదేరి హైదరాబాద్‌కు రాత్రి 11.15 గంటలకు చేరుకుంటుంది.

**ఆగే స్టేషన్లు:**

ఈ రెండు జనసాధారణ్ ప్రత్యేక రైళ్లు ఇరువైపులా ప్రయాణించే మార్గంలో క్రింది ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో ఆగనున్నాయి. చర్లపల్లి, జనగాం, కాజీపేట, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ స్టాఫ్‌లు ఉంటాయని రైల్వే తెలిపింది. ఈ ప్రత్యేక రైళ్లలోని అన్ని కోచ్‌లు అన్ రిజర్వ్‌డ్ (ఖఅతీవంవతీజవఎ) విభాగానికి చెంది నవి. అందుకే ప్రయాణికులు సాధారణ కౌంటర్ల వద్ద లేదా ఖూ యాప్ ద్వారా జనరల్ టికెట్ తీసుకుని ప్రయాణించవచ్చు. రద్దీని తట్టుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ రైలు సర్వీసులను ప్రయాణికులు వినియోగించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు ప్రారంభం



### హుసేనాపురంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**ప్యాపిలి, సెప్టెంబర్ 3 (సీమ కిరణం న్యూస్):** ప్యాపిలి మండలం హుసేనాపురం గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. త్రైత శాఖము - 48 లో భాగంగా, త్రిమత ఏకైక గురువు, త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో, త్రైత సిద్ధాంతము వారి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరగనున్నాయి.

**తేదీ: 04 నుండి 08 వరకు**

ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక, హుసేనాపురం శాఖ వారు తెలిపారు.

## ప్రియదర్శిని పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి సంబరాలు

### చిన్నికృష్ణుల వేషధారణతో అలరించిన చిన్నారులు





**ప్యాపిలి, సెప్టెంబర్ 3 (సీమ కిరణం న్యూస్):** ప్యాపిలి మండల కేంద్రంలోని ప్రియదర్శిని పాఠశాలలో గురువారం ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పాఠశాల చిన్నారులు చిన్నికృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో వచ్చి అందరినీ అలరించారు. ముద్దు ముద్దు మాటలతో, ఆహార్యంతో చిన్నారులు చేసిన హావభావాలు ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులచే ఉట్టి కొట్టించే కార్యక్రమం నిర్వహించారు. చిన్ని కృష్ణులు ఉట్టి కొట్టేందుకు చేసిన ప్రయత్నాలు అందరిలో ఉత్సాహాన్ని నింపాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పార్థసారథి మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను, శ్రీకృష్ణుడు చూపిన బోధనలను విద్యార్థులకు వివరించారు. భగవద్గీత సారాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పెరటి తోటలతో పోషకాహారం

### మహిళలకు అవగాహన

### ఐసి డిఎస్ సూపర్వైజర్ లక్ష్మీ నారాయణమ్మ






**ప్యాపిలి సెప్టెంబర్ 03 (సీమ కిరణం న్యూస్):** ప్యాపిలి మండలంలోని జలదుర్గం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో, ఐసీడీఎస్ శాఖ సహకారంతో మహిళలకు పెరటి తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఐసి డిఎస్ సూపర్వైజర్ లక్ష్మీ నారాయణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా కూరగాయలు, ఆకుకూరలను ఇంటి పరిసరాల్లో పెంచుకోవడం ద్వారా కుటుంబానికి తాజా, పోషకాహారం అందించవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మీ ప్రియ పాల్గొని పెరటి తోటల పెంపకానికి సంబంధించిన పలు సూచనలు, సలహాలను మహిళలకు అందించారు. అనంతరం మహిళలకు ఆకుకూరలు, కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం నాణ్యత తప్పనిసరి

### పీఆర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను తనిఖీ చేసిన

### డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్



**ప్యాపిలి, సెప్టెంబర్ 3 (సీమ కిరణం న్యూస్):** మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్ అన్నారు. మండలంలోని పీ.ఆర్. జడ్.పి.హెచ్. స్కూల్ ను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వంట గదిని, భోజన నాణ్యతను తనిఖీ చేశారు.విద్యార్థులకు వడ్డించిన ఎగ్ కర్రీ చాలా పల్చగా ఉండటాన్ని గమనించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే సహించేది లేదని, ఇకపై నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని వంట నిర్వాహకులను హెచ్చరించారు. నిబంధనల ప్రకారం సరిగా భోజనం అందించకపోతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.అనంతరం ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టేలా పర్యవేక్షించాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం అందించాలని ఆదేశించారు.

## వెంకటంపల్లిలో పోలీసుల పల్లెనిద్ర

### నేరాల నివారణపై ప్రజలకు అవగాహన

### ఎస్సై నాగార్జున



**ప్యాపిలి, సెప్టెంబర్ 3 (సీమ కిరణం న్యూస్) :** ప్యాపిలి మండలంలోని వెంకటంపల్లి గ్రామంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగార్జున గ్రామస్తులతో ముఖాముఖి సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. నకిలీ రుణ యాప్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్, లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. రోడ్డు భద్రతలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే తీవ్ర పరిణామాలను వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇచ్చి వారి భవిష్యత్తును నాశనం చేయవద్దని సూచించారు. అంతేకాకుండా మహిళల భద్రత, బాల్య వివాహాల నిరోధం, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరంగా తెలియజేశారు. ఏదైనా సమస్య ఉన్నా, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 - 112 కు, సైబర్ మోసానికి గురైతే 1930 హెల్ప్ లైన్ నంబర్ కు వెంటనే సమాచారం అందించాలని కోరారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, చట్టాన్ని గౌరవించాలని ఈ సందర్భంగా ఎస్సై పిలుపునిచ్చారు.

## ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ పరిశీలన

### డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్




**ప్యాపిలి, సెప్టెంబర్ 3 (సీమ కిరణం న్యూస్):** ప్యాపిలి మండలంలోని ఏనుగుమర్రి గ్రామంలో ఏర్పాటు చేసిన (సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్) షెడ్ ను డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షెడ్ లో జరుగుతున్న బెడ్ ప్రిపరేషన్ పనులను డిప్యూటీ ఎంపీడీవో వై. ప్రభాకర్ క్షుణ్ణంగా పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్త వేరుచేసే విధానం, కంపోస్టు తయారీకి చేస్తున్న బెడ్ ల ఏర్పాటుపై పిడిఓ అశ్వనికి పలు సూచనలు చేశారు. చెత్త నుండి సంపద తయారీలో భాగంగా కంపోస్టు ఎరువును నాణ్యతగా తయారు చేయాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశ్వని, గ్రీన్ అంబాసిడర్ తదితరులు పాల్గొన్నారు.

# పీఎఫ్ ఖాతాదారులకు గుడ్ న్యూస్ ఇకపై 3 నుంచి 4 రోజుల్లో క్లయిమ్ సెటిల్‌మెంట్..

పీఎఫ్ అనేది ప్రతి ఉద్యోగికి ఆర్థిక భరోసా కల్పిస్తుంది. ఉద్యోగం చేసే సమయంలో నెలవారీ కొంత మొత్తాన్ని దీనిలో జమచేస్తారు. ఉద్యోగ విరమణ అనంతరం పెద్ద మొత్తంలో ఆ ఉద్యోగికి అందజేస్తారు.మరి ఆ ఉద్యోగి కి రిటైర్మెంట్ కు ముందు అనుకోని ఖర్చులు వస్తే పరిస్థితి ఏమిటి, అతడి అవసరం ఎలా తీరుతుంది. దీని కోసమే అత్యవసర సమయంలో పీఎఫ్ నుంచి డబ్బులను విత్ డ్రా చేసుకునే వీలుంది. దాని ప్రకారం ఉద్యోగి తన డబ్బులను విత్ డ్రా చేసుకుని, అత్యవసర ఖర్చులకు వాడుకోవచ్చు.త్వరగా సెటిల్ మెంట్..ఉద్యోగి తన అవసరాలకు అనుగుణంగా పీఎఫ్ ఖాతా నుంచి డబ్బులు తీసుకోవచ్చు. దీనికి కొన్ని నిబంధనలు ఉంటాయి.ముందుగా కారణాన్ని వివరిస్తూ దరఖాస్తు చేసుకోవాలి. దీనినే క్లయిమ్ చేయడం అంటారు. ఆ దరఖాస్తును పరిశీలించి, నిబంధనల మేరకు డబ్బులను అతడి బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. ఇదంతా జరగడానికి కొంత సమయం (సుమారు 15 రోజుల నుంచి నెల) పడుతుంది. దానిని ఇప్పుడు వేగవంతం చేసేందుకు ఈపీఎఫ్ ఓ చర్యలు తీసుకుంది. కేవలం మూడు, నాలుగు రోజుల్లోనే సెటిల్ చేయనుంది. దీనిలో భాగంగా ఆటో సెటిల్ మెంట్ అనే విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది.మార్పులు ఇవే..వైద్యం ఖర్చుల కోసం చేసుకున్న క్లయిమ్ (రూల్ 68జే) లపై ఈపీఎఫ్ ఓ కొన్ని మార్పులు చేసింది. ఆ పరిమితిని రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచింది. విద్య, వివాహం (రూల్ 68కే), ఇళ్ల నిర్మాణానికి (రూల్ 68బి) సంబంధించి కూడా రూ.లక్ష పొందే అవకాశం కల్పించింది. ఆటో సెటిల్ మెంట్




విధానంలో వీటిని వేగంగా పొందే అవకాశం ఉంది.ఆటో సెటిల్ మెంట్..ఖాతాల క్లయిమ్ సెటిల్ మెంట్ లను వేగవంతంగా చేసి, వారి అవసరానికి ఉపయోగపడేలా వేగవంతంగా డబ్బులు ఇవ్వడానికి ఈపీఎఫ్ వో తీసుకువచ్చిన విధానమే ఆటో సెటిల్ మెంట్. మనిషి ప్రమేయం లేకుండా ఆటోమేటిక్ గా క్లయిమ్ పరిష్కారమవుతుంది. వైద్యం, ఉన్నత విద్య, విహహం, ఇల్లు కొనుగోలు కోసం ఉపయోగించుకోవచ్చు.పీఎఫ్ నుంచి డబ్బులు విత్ డ్రా చేసుకోవడానికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. చందాదారుడు వ్యక్తిగతంగా లేదా కుటుంబ సభ్యుల వైద్యం కోసం నగదును ఉపసంహరించుకోవచ్చు. నెల, అంతకంటే ఎక్కువ రోజులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా, శస్త్రచికిత్సలు చేయించుకుంటున్నా విత్ డ్రా చేసుకోవచ్చు. టీబీ, పక్షవాతం, కాన్సర్, గుండె సంబంధిత చికిత్స కోసం ఉపయోగించుకునే అవకాశం ఉంది. అన్ని పత్రాలు అప్ లోడ్ చేసి ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ ఉద్యోగి ఆరు నెలల బేసిక్ ప్లస్ డీఏ లేదా జమ చేసిన సొమ్ములో ఉద్యోగి వాటా (వడ్డీతో సహా).. రెండింటిలో ఏది తక్కువైతే అంత వరకూ డబ్బులు అందజేస్తారు. దీని కోసం డాక్టర్ సంతకం చేసిన సర్టిపికెట్ తప్పనిసరిగా సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.ఉద్యోగి తన, లేదా కుటుంబ సభ్యుల పెళ్లి, పిల్లల చదువు తదితర అవసరాల కోసం పీఎఫ్ ఖాతాను సొమ్మును తీసుకునే వీలుంది. చందదారుడిగా చేరి ఏడేళ్ల పూర్తయిన వారికి మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. అది క్ష్దూడా మూడు సార్లు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. బ్యాలెన్స్ లో కనీసం 50 శాతం తీసుకోవచ్చు. వివాహం కోసం అయితే డిక్లరేషన్ అందజేయాలి. చదువు కోసం అయితే సంబంధిత సర్టిఫికెట్ ఇవ్వాలి.ఇల్లు లేదా స్థలం కొనుగోలు, ఇంటి నిర్మాణం, మరమ్మతుల కోసం క్ష్దూడా డబ్బులను విత్ డ్రా చేసుకోవచ్చు. చందదారులు చేరి ఐదేళ్లు పూర్తయిన వారికి కేవలం రెండు స్లార్ల మాత్రమే ఈ విధానంలో అవకాశం ఉంటుంది.వేగంగా సెటిల్ మెంట్..ఇలాంటి క్లయిమ్ ల సెటిల్ మెంట్ అత్యంగా వేగంగా జరగనుంది. ఆటో సెటిల్ మెంట్ విధానంలో చాలా సులభంగా ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ విధానంలో మానవ ప్రమేయం ఉండదు. కేవైసీ, బ్యాంక్ లింక్ అన్ని సక్రమంగా ఉంటే కేవలం 3 నుంచి 4 రోజుల్లో డబ్బులు అందుతాయి.

# వణికిస్తున్న బ్లడ్ స్కాండల్ రిపోర్ట్! 30 వేల మందికి ఎయిడ్స్! పూర్తి వివరాలివే!



రక్తం మనిషికి ప్రాణదానం చేస్తుంది. అందుకే సెలబ్రిటీలు మొదలు.. సామాజిక, సేవా, స్వచ్ఛంద సంస్థలు రక్తదాన ప్రాముఖ్యతను వివరిస్తుంటాయి. అయితే రక్తదానం మనిషికి ప్రాణాలు పోయడం ఎంత నిజమో..ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా.. నిండు ప్రాణాలు బలి తీసుకుంటుంది అన్నది కూడా అంతే వాస్తవం. ప్రతి ఏటా కలుషిత రక్తం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు, మరణాలు సంభవిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ప్రపంచ చరిత్రలోనే అత్యధిక మందిని బలితీసుకున్న బ్లడ్ స్కాండల్.. రక్త కుంభకోణం 40 ఏళ్ల క్రితం యూకేలో వెలుగు చూసింది.తాజాగా బ్రిటన్ ప్రధాన మంత్రి రిషి సునాక్.. ఈ దారుణానికి సంబంధించిన పూర్తి నివేదికను వెల్లడించడమే కాక.. బాధితుల కుటుంబాలకు క్షమాపణలు తెలియాజేశారు దాంతో మరోసారి ప్రపంచవ్యాప్తంగా ఈ ఉదంతం చర్చనీయాంశం అవుతోంది. అసలేంటి బ్లడ్ స్కాండల్.. ఇది ఎలా జరిగింది.. ఎందరు చనిపోయారు.. ఈ దారుణంలో బాధితులెందరూ వంటి పూర్తి వివరాలు మీకోసం..30 వేల మందికి ఎయిడ్స్.. 3 వేల మరణాలు..సుమారు 40 ఏళ్ల క్రితం లండన్‌లో ఈ రక్త కుంభకోణం వెలుగు చూసింది. ఈ కలుషిత రక్తం కారణంగా వేల మంది హెచ్ఐవీ, హెపటైటిస్ బాధితులుగా మారారు. ఇన్నాళ్ల తర్వాత ఈ ఘటనకు సంబంధించిన తుది నివేదక వచ్చింది. యూకే చరిత్రలోనే అత్యంత దారుణమైన ఘటనగా చరిత్రలో నిలిచిన ఈ ఉదంతంపై రిషి సునాక్ ప్రభుత్వం సోమవారం పూర్తి వివరాలు బయటపెట్టింది. నివేదికలో తెలిపిన దాని ప్రకారం.. ఈ కలుషిత రక్తం కారణంగా 30 వేల మంది హెచ్ఐవీ, హెపటైటస్ బారిన పడగా.. సుమారు 3 వేల మంది వరకు మృత్యువాత పడ్డారు.చికిత్స కోసం కలుషిత రక్తం..1970 దశకంలో బ్రిటన్ ప్రభుత్వం.. హీమోఫిలియా వ్యాధిగ్రస్తులు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రుల కోసం ప్లాస్మా చికిత్సను అందుబాటులోకి తెచ్చింది. ఈ క్రమంలో ఫ్యాక్టర్ %ఎ×××% పేరుతో ల్యాబ్‌లో తయారైన కృత్రిమ రక్తాన్ని వినియోగించారు. దీన్ని బ్రిటన్ నేషనల్ హెల్త్ సర్వీస్.. అమెరికా నుంచి దిగుమతి చేసుకుంది. చికిత్సలో భాగంగా వేలాది మంది బాధితులకు ఈ రక్తాన్ని వినియోగించారు. అయితే 1970-90ల మధ్య ప్లాస్మా చికిత్స తీసుకున్న చాలా మందిలో.. సైడ్ ఎఫెక్ట్స్ కనిపించడం మొదలైంది. ముందుగా లివర్ ఇనఫెక్షన్‌కు గురై.. అది కాస్త క్రమంగా హెచ్ఐవీ, హెపటైటిస్-సీ వంటి ప్రాణాంత వ్యాధులకు దారి తీసినట్టు నిర్ధారించారు.ఈ బాధితుల సంఖ్య 30 వేలకు పైగా ఉండగా.. వీరిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఇక ఇలా ఇన్‌ఫెక్షన్‌కు గురైన వారిలో సుమారు 3 వేల మంది చనిపోయినట్లు.. నివేదికల్లో వెల్లడయ్యింది. ఇక కొన్ని సందర్భాల్లో హీమోఫీలియాతో బాధపడుతున్న పిల్లలను పరిశోధన వస్తువులుగా భావించారని.. తర్వాత కాలంలో వీరిలో చాలా మందికి హెచ్ఐవీ, హెపటైటిస్ సోకి చనిపోయారని నివేదిక స్పష్టం చేసింది. ఇక ఈ చికిత్స కోసం.. ఖైదీలు, డ్రగ్స్ బానిసల వంటి ప్రమాదకర దాతల నుంచి స్వీకరించిన రక్తం నుంచి సేకరించిన ప్లాస్మాను వినియోగించినట్లు తెలిసింది.ఎంత నష్టపరిహారం అయినా చెల్లిస్తాం: రిషి సునాక్ఇలా స్వీకరించిన కలుషిత రక్తాన్ని.. ప్రసవం, సర్జరీలు, ప్రమాదాల బారినపడిన రోగుల చికిత్సలో వినియోగించారని.. ఫలితంగా వేల మంది ఎయిడ్స్, హెపటైటిస్ బారిన పడినట్లు తేలింది. ఆ తర్వాత కాలంలో ఈ దారుణం వెలుగు చూడటంతో.. యూకే ప్రభుత్వం దీనిపై పూర్తి స్థాయిలో విచారించేందుకు ఓ కమిటీని నియమించింది. ఇక తాజాగా న్యాయమూర్తి బ్రియాన్ లాంగ్‌స్టాప్ నేతృత్వంలోని కమిటీ.. 2500 పేజీల నివేదికను సమర్పించింది. అయితే ఇది పూర్తి స్థాయి నివేదిక కాదని.. లాంగ్‌స్టాఫ్ తెలిపారు. ఇక 1980 ప్రాంతంలో రక్తం ద్వారా ఎయిడ్స్ సంక్రమించవచ్చని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. అయినా సరే.. ప్రభుత్వాలు, ఆరోగ్య నిపుణులు ఈ కలుషిత రక్తం కుంభకోణాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఎయిడ్స్ వ్యాప్తి ప్రమాదాలను నివారించడంలో వారు విఫలం అయ్యారు.ఇక తాజాగా అందిన నివేదికపై రిషి సునాక్ మాట్లాడుతూ.. "బ్లడ్ స్కాండల్‌లో వేలాది మంది బాధితులుగా మారిన దశాబ్దాల నాటి ఈ ఘటనను ఇన్నాళ్లు దాచి పెట్టినందుకు క్షమాపణలు కోరుతున్నాను. ఈ భయంకరమైన అన్యాయానికి నేను మనస్ఫూర్తిగా, నిర్ద్వంద్వంగా క్షమాపణలు చెప్పాలనుకుంటున్నాను. బాధిత కుటుంబాలకు ఎంత నష్టపరిహారం అయిన చెల్లించేందుకు మేం సిద్ధం" అన్నారు.

# చైనా ఆక్రమిస్తే.. కిల్ స్విచ్ ఆన్ అవుతుంది సెమీకండెక్టర్ తయారీ సంస్థల ప్లాన్..!

ఇంటర్నెట్‌డెస్క్: తైవాన్‌ను బలప్రయోగం ద్వారా దక్కించుకొని.. చిప్ పరిశ్రమను ఏలాలన్న చైనా (%జప్త్రఅఖు%) కలను భగ్నం చేసేందుకు టెక్ కంపెనీలు ప్లాన్ చేశాయి.ఒకవేళ బీజింగ్ తన సైనిక బలంతో దురాక్రమణ చేస్తే.. ప్రపంచంలోనే అత్యాధునిక చిప్ తయారీ యంత్రాలు డిజేబులైపోయేలా ఏర్పాట్లు చేశారు. ఈ విషయాన్ని అమెరికా ప్రభుత్వంలోని ఇద్దరు అధికారులు చెప్పినట్లు బ్లూమ్‌బెర్గ్ పత్రిక కథనంలో పేర్కొంది.కొన్నాళ్ల క్రితం అమెరికా ప్రభుత్వం డచ్, తైవాన్ టెక్ సంస్థలతో సమావేశమైంది. ఒకవేళ తైవాన్‌పై చైనా ఆక్రమణ చేపడితే పరిస్థితి ఏమిటని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీనికి డచ్‌కు చెందిన ఏఎస్ఎంఎల్ అధికారులు సమాధానమిస్తూ.. మా ప్రభుత్వం ఎప్పుడైతే ఈ ముప్పుపై మమ్మల్ని సంప్రదిస్తుందో.. తక్షణమే ఆ యంత్రాలను రిమోట్ విధానంలో డిజేబుల్ చేసేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పటికే నెదర్లాండ్స్ ప్రభుత్వం ఈ దిశగా కొంత కసరత్తు కూడా చేసినట్లు వెల్లడించారు. మరోవైపు ఈ అంశంపై బహిరంగంగా మాట్లాడేందుకు ఏఎస్ఎంఎల్, టీఎస్ఎంసీ, డచ్ వాణిజ్య మంత్రిత్వశాఖ, శ్వేతసౌధం ప్రతినిధి ఇష్టపడలేదు.ప్రపంచంలో చిప్‌ల తయారీకి వాడే ఏఎస్ఎంఎల్‌కు చెందిన ఎక్స్‌ట్రీమ్ అల్ట్రావైలెట్ మిషిన్లను ఈయూవీలుగా పేర్కొంటారు. దాదాపు 200 మిలియన్ డాలర్ల ఖరీదుతో.. ఒక బస్సు సైజులో ఉండే ఈ యంత్రాలకు తరచూ సర్వీసింగ్‌లు, అప్‌డేట్లు తయారీ కంపెనీ నుంచి వెళుతుండాలి. ఇలాంటి సందర్భాల్లో కంపెనీ దానిని రిమోట్ స్విచ్ సాయంతో నిలిపివేసే అవకాశం ఉంది.ఇప్పటికే అమెరికా కోరిక మేరకు చైనాకు అత్యాధునిక చిప్ తయారీ యంత్రాలు ఇవ్వకూడదని ఏఎస్ఎంఎల్ నిర్ణయించింది. వాషింగ్టన్ ఒత్తిడి మేరకు డచ్ ప్రభుత్వం ఈ ఏడాదే నిర్ణయం తీసుకొంది. దీంతోపాటు ఇప్పటికే స్వీకరించిన ఆర్డర్లలో కూడా కోత విధించింది. ఈ నిర్ణయంతో దాదాపు 15 శాతం విక్రయాలు తగ్గే అవకాశం ఉందని ఆ కంపెనీ అంచనా వేసుకొంది.ఏఎస్ఎంఎల్ యంత్రాలకు తరచూ స్పేర్‌పార్టులు మారుస్తూ, మెయింటెనెన్స్ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేకంగా తయారుచేసిన దుస్తులు, పరికరాలు వినియోగించాలి. ఇవి కూడా హాలెండ్ నుంచే రావాల్సి ఉంటుంది. చైనా ఆక్రమణ వేళ ఇటువంటి సేవలు కూడా నిలిచిపోయే అవకాశం ఉంది.మరోవైపు చైనా గతేడాది అమెరికాకు భారీగానే షాకిచ్చింది. యాపిల్ ఫోన్లలో వినియోగించే అత్యాధునిక చిప్స్‌ను పాత మోడల్ ఏఎస్ఎంఎల్ యంత్రాలు, అమెరికా నుంచి దిగుమతి చేసుకొన్న కొన్ని టూల్స్ వాడి తయారుచేసింది. ఇక హువావే నేతృత్వంలో ఆ దేశం చిప్స్ తయారీలో స్వయంసమృద్ధి సాధించడంపై దృష్టిపెట్టింది. ఈ దిశగా



ముందడుగు కూడా వేసింది.గతేడాది సెప్టెంబర్‌లో టీఎస్ఎంసీ అధిపతి మార్క్ ల్యూ మాట్లాడుతూ కంపెనీ చిప్ మేకింగ్ యంత్రాలు పనిచేయకుండా చేసేందుకు ఒక మార్గాన్ని సిద్ధం చేశామన్నారు. టీఎస్ఎంసీని ఎవరూ బలవంతంగా నియంత్రించలేరని వ్యాఖ్యానించడం అమెరికా ప్లాన్‌కు అద్దం పడుతోంది.గతేడాది చైనాకు చిప్ తయారీ యంత్రాల ఎగుమతి ఆపేస్తున్నట్లు డచ్ ప్రకటించింది. జాతీయ భద్రతను దృష్టిలోపెట్టుకొని ఈ నిర్ణయం తీసుకొన్నట్లు ఆ ప్రభుత్వం వెల్లడించింది. వీటిల్లో అత్యంత కీలకమైన ఏఎస్ఎంఎల్ సంస్థ అభివృద్ధి చేసిన చిప్ టెక్నాలజీ కూడా ఉంది. ప్రపంచ చిప్స్ తయారీ విభాగంలో ఏఎస్ఎంఎల్ ముఖ్యమైన సంస్థ. దీంతో ఫోన్ల నుంచి ఆయుధాల వరకు ఉపయోగించే సెమీకండక్టర్ల తయారీలో ముఖ్యమైన దశలపై దీని ప్రభావం తీవ్రంగాఉంది.

# అసలు రేవ్ పార్టీ అంటే ఏంటి.. రేవ్ పార్టీలో ఏం చేస్తారు..




గత రెండు రోజులుగా రేవ్ పార్టీ(గురించి అటు మెయిన్ మీడియా, ఇటు సోషల్ మీడియాలో వార్తల గలగలలు వినిపిస్తూనే ఉన్నాయి. ఒక్క నగరాలే అని కాదు పట్టణాల్లో కూడా ఈ కల్చర్ విస్తరించింది.అసలు ఈ రేవ్ పార్టీ అంటే ఏంటి? రేవ్‌పార్టీలో ఏమేమి ఉంటాయి.. ఇందులో ఏం చేస్తారు? ఎందుకు పోలీసులు పట్టుకుంటారు? ఇలాంటి విషయాలపై నెటిజన్లకు ఆసక్తి నెలకొంది. అయితే రేవ్ పార్టీ కల్చర్ 1950ల్లో ఇంగ్లండ్‌లోప్రారంభమైంది. ఆ తర్వాత నెమ్మది నెమ్మదిగా ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. అయితే మొదట్లో ఈ పార్టీల్లో మ్యూజిక్, డ్యాన్స్, మద్యం తాగుతూ ఎంజాయ్ చేసేవారు. లండన్‌లో ఇటువంటి ఉద్వేగభరితమైన పార్టీలను 'రేవ్ పార్టీలు' అని పిలుస్తారు. ఆ తర్వాత ఈ పార్టీ కల్చర్ ఖండాంతరాలు విస్తరిస్తూ రూపాంతరం చెందింది. ఏదైనా క్లోజుడ్ ప్రదేశంలో, పెద్ద హాల్‌లో చెవులు పగిలిపోయే మ్యూజిక్ పెట్టుకుని మంద్యం సేవిస్తూ పార్టీ చేసుకునే వారు. డ్యాన్స్ పార్టీ(%ఖుఅవెవ%) కాస్తా రేవ్ పార్టీగా మారి పోయింది. మన దేశంలో మాదక ద్రవ్యాల నిరోధక(ఎన్‌డీపీఎస్) చట్టం ప్రకారం గంజాయికి కొకైన్ ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ మొదలైన మత్తుపదార్థాలు , మాదకద్రవ్యాల వాడకం నిషేధం.మన దేశంలో గోవా నుంచి ప్రారంభమైంది. ముంబై, పుణె, బెంగళూరు, కోల్‌కతా, ఢిల్లీ-ఎన్‌సిఆర్ నగరాల్లో ఈ పార్టీ కల్చర్ వచ్చింది. ఈ సంస్కృతి హైదరాబాద్ నగరంలో కూడా విస్తరించింది. గత కొన్ని సంవత్సరాలుగా హిమాచల్ లోని కులు లోయ, బెంగుళూరు, పూణే, ముంబై వంటి అనేక నగరాలు వీటికి హాట్‌స్పాట్‌లుగా నిలిచాయి. ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్ ఈవెంట్స్ అని కూడా పిలిచే రేవ్ పార్టీలు పలు రకాలుగా ఉంటాయి. సాధారణంగా రేవ్ పార్టీలు చాలా ఖరీదుతో కూడుకున్నవి. ఈ పార్టీల్లో గోప్యత కూడా ముఖ్యమైనదిగా భావిస్తారు. అందుకే పెద్ద తలకాయలు, సెలబ్రిటీలు, సినీతారలు ఎంజాయ్‌మెంట్ కోసం ఇక్కడికి వస్తుంటారు. డ్యాన్స్, ఫన్, ఫుడ్, మద్యంతోపాటు, డ్రగ్స్‌కూడా లభ్యమవుతాయి. ఫుడ్, ఆల్కహాల్, సిగరెట్లు కాకుండా, కొకైన్, హషిష్, చరాస్, ఎల్ఎస్‌డి, మెఫెడ్రోన్ తదితర డ్రగ్స్ కూడా దొరుకుతాయని చెప్తారు. కొన్ని రేవ్ పార్టీలలో లైంగిక కార్యకలాపాల కోసం ప్రత్యేక గదులు కూడా ఉంటాయట అందుకే సెక్యూరిటీ పరంగా చాలా జాగ్రత్తలు తీసుకుంటారని చెప్తారు.క్రమక్రమంగా ఈ రేవ్ పార్టీ కల్చర్ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వేదికైంది. మద్యంతో పాటు అమ్మాయిల న్యూడ్ డ్యాన్స్ చేయించడం, యాంఫేటమిన్, ఎల్ఎస్‌డీ, కెటామైన్, మెథాంఫేటమిన్ , కొకైన్ , గంజాయి లాంటి మాదకద్రవ్యాల వాడకం స్టార్ట్ చేశారు. ఇలాంటి చట్టవ్యతిరేక రేవ్ పార్టీలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఆ పార్టీలో పాల్గొన్న వారిని అదుపులోకి తీసుకుని, నిర్వాహకులను అరెస్ట్ చేస్తారు. ఇవి చట్టవ్యతిరేక పార్టీలు అని తెలిసినా ఈ పార్టీలో సెలెబ్రిటీలు పాల్గొనడం గమనార్హం

# రోజంతా ఒడిదుడుకుల్లోనే.. స్వల్ప నష్టాలతో ముగిసిన సెన్సెక్స్!





అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు, ఎన్నికల నేపథ్యంలో దేశీయ సూచీలు రోజంతా ఒడిదుడుకుల్లోనే కదలాడాయి. లాభనష్టాలు దోబూచులాడాయి. ఈ వారంలో ట్రేడింగ్‌కు తొలి రోజు అయిన ఈ రోజు (మంగళవారం) సెన్సెక్స్ స్వల్పంగా నష్టపోయింది.అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు, ఎన్నికల నేపథ్యంలో దేశీయ సూచీలు రోజంతా ఒడిదుడుకుల్లోనే కదలాడాయి. లాభనష్టాలు దోబూచులాడాయి. ఈ వారంలో ట్రేడింగ్‌కు తొలి రోజు అయిన ఈ రోజు (మంగళవారం) సెన్సెక్స్ స్వల్పంగా నష్టపోయింది.

# మేడిగడ్డపై కేసీఆర్ మాటే నిజం.. అన్నదాతల ఆగ్రహంతో దిగొచ్చిన ప్రభుత్వం



బరాజ్ కుంగుబాటుపై ఇన్నాళ్లూ రాద్ధాంతంరిపేర్లు, ఎత్తిపోతలు వదిలి రాజకీయంఎన్నికల్లో లబ్ధికోసం కేసీఆర్‌పై బద్నాంతీరా నీళ్లందక లక్షలాది ఎకరాల్లో పంటనష్టంరైతుల కోపాగ్నికి జడిసి మరమ్మతులకు నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ సర్కార్ 'అనుభవమైతేగాని ఏదీ తెలిసి రాదు'. ఇలానే ఇప్పుడు రైతుల కోపాగ్ని తాకితేగాని కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ సర్కారుకు తత్వం బోధపడలేదు. నిన్నటిదాకా ప్రాజెక్టే నిరర్ధకం, నిష్ప్రయోజనమని మాట్లాడిన నోటితోనే ఇప్పుడు మరమ్మతులు చేసి నీటిని ఎత్తిపోస్తామని సోమవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రకటించింది. ప్రాజెక్టును బందు పెట్టడం వల్ల జరిగిన నష్టమేమిటో బోధపడడంతో దిద్దుబాటుచర్యలు చేపట్టింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పినా పెడచెవిన పెట్టి, పిల్లర్ల కుంగుబాటుపై రాద్ధాంతం చేసి.. లక్షలాది ఎకరాలను ఎండబెట్టి చివరికి రైతుల ఆగ్రహాన్ని చవిచూశాక ఇప్పుడు తప్పు తెలుసుకున్నది. ఎన్డీఎస్ఏ నివేదిక ఆధారంగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన బరాజ్‌ల మరమ్మతులకు సంసిద్ధత తెలిపింది.ఇన్నాళ్లూ తప్పుడు ప్రచారంకాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాక్‌లోని 20పిల్లర్ కుంగుబాటునకు గురైన విషయం తెలిసిందే. ఆ ఒక్క సాంకేతిక లోపాన్ని సాకుగా చూపి మొత్తం ప్రాజెక్టే నిష్ప్రయోజనమనే తప్పుడు ప్రచారానికి కాంగ్రెస్ పూనుకున్నది. ఇదే ఎన్నికల ప్రచార అస్త్రంగా చేసుకొని రాజకీయ లబ్ధికోసం అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు కూడా కూలిపోతాయంటూ విషం చిమ్మింది. అధికారంలోకి వచ్చాక బరాజ్‌ల మరమ్మతులు మాని, రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలి, కేవలం రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేసుకున్నది. ప్రాజెక్టు పేరిట కేసీఆర్‌ను బద్నాం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నది. మంత్రులు, ముఖ్యమంత్రి స్వయంగా బరాజ్‌లను సందర్శించి మరీ అవి నిష్ప్రయోజనం, నిరర్ధకం, వృథా అంటూ కొండెక్కి కూశారు. అసెంబ్లీ వేదికగా అబద్ధపు ప్రచారం చేశారు. నీటి ఎత్తిపోతలు ఆపేసి, అప్పటికే బరాజ్‌లలో నిల్వ ఉన్న నీటిని సైతం దిగువకు వృథాగా వదిలేశారు. దీంతో యాసంగిలో ప్రాజెక్టు పరిధిలోని లక్షలాది ఎకరాలు సాగునీరందక ఎండిపోయాయి. పదేళ్లలో ఎన్నడూ లేనంతగా భూగర్భజలాలు పడిపోయాయి. ఫలితంగా రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వచ్చింది.కేసీఆర్ చెప్పినా పెడచెవిన..మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించవచ్చని, అది పెద్ద సమస్య కాదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, రాష్ట్ర ఇంజినీరింగ్ నిపుణులు సైతం మొదటినుంచీ కాంగ్రెస్ ప్రభుత్వానికి చెబుతూ వస్తున్నారు. మేడిగడ్డ బరాజ్ ఎగువన చిన్నపాటి అడ్డుకట్ట వేస్తే నీటిని లిఫ్ట్ చేసుకునే వెసులుబాటు ఉంటుందని నొక్కి చెప్పారు. అయి నా కాంగ్రెస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. రైతుల్లో అసహనం, ఆగ్రహం పెరిగాక ఇప్పు డు ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదికను ముందుపెడుతూ బరాజ్‌లను మరమ్మత్తులు చేయించాలని నిర్ణయించినట్టు వెల్లడించింది. వచ్చే వానకాలంలో నీటిని లిఫ్ట్ చేసే అంశాలపైనా దృష్టి పెట్టినట్టు స్పష్టం చేసింది. ఇదేదో యాసంగిలోనే చేసి ఉంటే లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోకపోయేవని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే యూరప్ మార్కెట్లు కూడా నష్టాలతోనే ఈ రోజును ప్రారంభించాయి.ఛానల్ ఫాలో అవ్వండిగత వారం ముగింపు (74,005)తో పోల్చితే దాదాపు 150 పాయింట్ల నష్టంతో ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా అనిశ్చితిలోనే కదలాడింది. మంగళవారం 73,762-74,189 శ్రేణి మధ్యనే కదలాడింది. చివరకు 52 పాయింట్ల నష్టంతో 73,953 వద్ద రోజును ముగించింది. నిఫ్టీ మాత్రం స్వల్ప లాభంతో ముగిసింది. 27 పాయింట్ల లాభంతో 22,529 వద్ద రోజును ముగించింది. బ్యాంక్ నిఫ్టీ 151 పాయింట్లు నష్టపోయింది. మిడ్ క్యాప్ ఇండెక్స్ 199 పాయింట్లు ఆర్జించింది.బాలకృష్ణ ఇండస్ట్రీస్, వేదాంత, ఆదిత్యా బిర్లా ఫ్యాషన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ తదితర షేర్లు లాభపడ్డాయి. సిటీ యూనియన్ బ్యాంక్, ఆస్ట్రాల్, ఎమ్‌సీఎక్స్ ఇండియా, కమిన్స్ నష్టాలను మూటగట్టుకున్నాయి. డాలరుతో రూపాయి మారకం విలువ ప్రస్తుతం 82.30 వద్ద ట్రేడ్ అవుతోంది.

# బీజేపీకి ఎన్ని లోక్‌సభ సీట్లు వస్తాయంటే పీకే జోస్యం




2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని మరోసారి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం విజయతీరాలకు చేర్చే అవకాశాలున్నాయని ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, జన్ సూరజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిషోర్ అన్నారు.2019లో బీజేపీ సాధించిన 303 సీట్లకు దగ్గరగా కానీ, దానిని స్వల్పంగా అధిగమించే అవకాశాలు కానీ ఈసారి (2024) ఉన్నాయని ఆయన జోస్యం చెప్పారు."మోదీ సారథ్యంలోని బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తుందని నేను అనుకుంటున్నాను. గత ఎన్నికల్లో సాధించిన సీట్లతో సమానంగా ఈసారి సీట్లు గెలుచుకోవచ్చు. లేదంటే కొద్దిగా సీట్లు పెరగనూ వచ్చు" అని ప్రశాంత్ కిషోర్ అన్నారు. ఐదో దశలో తగ్గిన పోలింగ్ శాతం.. 2019తో పోలిస్తే తగ్గిందా, పెరిగిందా?సహజంగా అధికారంలో ఉన్న ప్రభుత్వం పట్ల కానీ, వారి నేతలపై కానీ కోపం ఉన్నప్పుడు ప్రత్యామ్నాయం ఉందా లేదా అనేది కూడా చూడకుండా ప్రజలు వారిని సాగనంపుతారని, అయితే ఇంతవరకూ మోదీపై విస్తృతమైఆన ప్రజాగ్రహం ఉన్నట్టు వినిపిచండం లేదని పీకే చెప్పారు. "ప్రజలు నిరాశచెంది ఉండొచ్చు...తమ కలలు సాకారం కాలేదని అనుకోవచ్చు. కానీ విస్తృత ప్రజాగ్రహం ఉన్నట్టు ఎవరూ చెప్పుకోవడం లేదు" అని ఆయన వివరించారు.బీజేపీ 370 సీట్లు, ఎన్డీయే 400కు పైగా సీట్లు గెలుచుకునే అవకాశాలపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, బీజేపీ 370 సీట్లు ఆశిస్తున్నామని చెబుతున్నా 270 సీట్లు వస్తే ప్రభుత్వం ఏర్పాటు చేయమని ఆ పార్టీ నాయకులు చెప్పలేరని అన్నారు. ఆ ప్రకారం చూసినప్పుడు వారు మెజారిటీకి అవసరమైన 272 సీట్లు సాధిస్తారా లేదా అనేది చూడాల్సి ఉంటుందన్నారు. అయితే ఎలాంటి రిస్క్ ఉండదనే తాను అనుకుంటున్నానని, ఎన్డీయే తిరిగి అధికారంలోకి వచ్చేలాగానే కనిపిస్తోందని అన్నారు.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com